స్కెచ్

# చిలకా గోరింకలు

"మాలి"

రాత్రి భోజనాలు పూర్తి అయినతర్వాత వార్తా పత్రిక ముందుపరచుకొని పడకకుర్చీలో మేను వాల్చాడు నాన్న. శరత్‌బాబు నవల ఒకటి తీసుకొని ఎదురుగా కూర్చుంది మా అమ్మ. వాళ్ళిద్దరి సంభాషణా వింటూ నేనూ, కమలా ఆ ప్రక్కనే కూర్చున్నాం. నాన్నా, అమ్మా మాట్లాడుకొనేవి సంభాషణలు అనడం కంటే, తాజా వార్తలమీద కీచులాట అనడం బాగుంటుందేమో!

నాన్న పేపరు చూస్తూ చూస్తూ అకస్మాత్తుగా గొంతు సవరించుకొని బిగ్గరగా చదివాడు. "ప్రభుత్వోద్యోగి విషాద మరణం"...

మా కమల "అయ్యో పాపం!" అంది.

"ఈరోజు ఉదయం ఆరు గంటలకు, రైలు పట్టాలు దాటుతుండగా, గూడ్సు రైలుక్రింద పడి మరణించాడు ... ఎంత ఘోరం!" అంటూ వ్యాఖ్యానంకూడా జతచేశాడు నాన్న.

అమ్మ చేతిలో నవల క్రిందపెట్టి అన్నది: "ఆత్మహత్యే! ఏమీ అనుమానంలేదు..."

"నీ ముఖం! ఈ పేపర్లో ఏమి వ్రాశారంటే–"

మా నాన్న సమాధానం పూర్తయినా కాలేదు. "పేపర్లో ఏమి వ్రాశారో ఎవరికి కావాలి? ఇలాటి సంఘటనలకు కారణం ఏదో ఒకటి ఊహించి వ్రాస్తుంటారీ పత్రికలవాళ్లు! ఇదిమాత్రం ఆత్మహత్యే! అనుమానించవలసిన అవసరమే కనబడదు." అని తేల్చేసింది అమ్మ.

"ఆత్మహత్యేనని నీకెట్లా తెలుసు? నీకెవరు చెప్పారు? మీ నాయనమ్మదగ్గరినుంచి జాబు వచ్చిందా?"

"ఎవరో ఎందుకు చెప్పాలి? నేనే చెబుతున్నా! రైలు వస్తుంటే ఎంత చవటయినాగూడా రైలు పట్టాలు దాటాలని ప్రయత్నించడు. అదీగాక, వాడికి ఆవేళప్పుడు అక్కడ ఉండాల్సిన అవసరమే లేదు..."

"అసలు వాడు ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఎందుకొచ్చిందంటావ్?"

ఈ ప్రశ్నతో అమ్మ నోరు మూయించేశాననుకున్నాడు నాన్న. కాని అరనిముషంలోనే అమ్మ సమాధానం తుపాకీ గుండులా దూసుకు వచ్చింది.

"బహుశా పెళ్ళాంతో పోట్లాడి వుంటాడు!"

"అయితే, ఈ ఆత్మహత్యకు కారణం ఆడదేనని నీవు అంగీకరిస్తున్నావన్న మాట!" విజయ గర్వంతో విషయం విశదం చేశాడునాన్న. నాన్న విశదం చేశాననుకుంటున్న విషయం అమ్మ వినిపించుకున్నట్లే లేదు.

"పోట్లాడిన తర్వాత, తప్పు తనదేనని తెలుసుకొని వుంటాడు. పిరికివాడు కాబట్టి తిరిగి భార్యకు ముఖం చూపించుకోలేక, అలా ఆత్మహత్య చేసుకొని ఉంటాడు...మగవాళ్ళంతా ఇంతే. వట్టి పిరికి పందలు!"

ఇక ఈ విమర్శకు నాన్న సమాధానం చెప్పాడా రాత్రి మాకు నిద్రలేదన్నమాటే! ఈ ఫలితానికి నాన్నకూడా భయపడ్డాడు గాబోలు పత్రికలో ముఖంపెట్టి పేజీ త్రిప్పాడు. అమ్మ తిరిగి శరత్ నవల తీసుకుంది.

అయిదు నిముసాలు అయిందో లేదో, నాన్న అకస్మాత్తుగా ఆశ్చర్యం కనబరుస్తూ, కొంత బిగ్గరగానే అన్నాడు:

"భలే, గవర్నమెంటే అప్పుల పాలయిందట!"

మా అమ్మ చేతిలో నవల క్రింద పెట్టింది.

"అసలు మన భారతీయులే, పనికిరాని చచ్చు సన్యాసులంటాను. పరిపాలించడం చేతకానప్పుడు స్వతంత్రం కావాలని ఆఘోరించడం దేనికీ!"

మామూలుగా మా నాన్నను రెచ్చగొట్టే స్థాయిలోనే యీ వాక్యాలు నడిచాయి. అయితే అమ్మ మరింత ప్రమాదకరస్థితిలోకి పోతుంది. మిగిలిన విషయాలైతే ఫర్వాలేదుగాని, ఇలా ప్రభుత్వాన్ని

విమర్శించడంవల్ల, నిపలైన కాంగ్రెసువాది మా నాన్నకు, కనీసం రవ్వంత కోపమన్నా రావడం న్యాయం. మా అమ్మవైపు ఒక సెకండు కాలం తీక్షణంగా చూచి అన్నాడు నాన్న:

“అసలు యీ విషయాల్ని గురించి ఆడవాళ్ళకు అతి స్వల్పంగా కూడా తెలియదు.”

మతాబా రగుల్కొన్నది.

“ఏం తెలియాలో? యీ కాంగ్రెస్ మంత్రుల బండారం నాకే కాక, ఆఖరికి మన పని మనిషి రామికి కూడా బాగా తెలుసు ఈ మంత్రులంతా వట్టి స్వార్థపరులు. తెల్లటోపీలు వేసుకొని అమాయక ప్రజల్ని మోసం చేస్తున్న ఊసరవెల్లులు.”

నాన్న రాజకీయ చర్చలో కాలు మోపాడు. ఎదుట ఎవరితో వాదం చేసి కూడా మరచినట్లుంది. సీరియస్‌గా అన్నాడు.

“మీరు చెప్పినదాన్ని సమర్థించుకొనేందుకు తగిన ప్రమాణాలు చూపి ఋజువుకరచవలసిన బాధ్యత మీ మీదవుంది.”

అమ్మ కొంచెం నిదానించే సమాధానం చెప్పింది:

“ఇప్పుడు మన జీవితం చూడండి దీన్ని బ్రిటిష్ ప్రభుత్వ పరిపాలనా కాలంతో పోల్చి చూచుకుంటే, మీకే తెలుస్తుంది. ఇప్పటికంటే అప్పుడే మనం బాగా బ్రతికామన్న విషయం ఎవరూ కాదనడానికి వీల్లేదు ఉదాహరణకు చక్కెర ధర చూడండి.” నాన్న మధ్యలోనే అమ్మ ఉపన్యాసం ఆపుచేశాడు.

“మీ ఆడవాళ్ళ ఆలోచనలన్నీ వంటింటికే పరిమితమై ఉంటాయి. ఎప్పుడూ వంటకు కావలసిన సరకుల ధరలు గుణించుకోవడం తప్ప మీకు మరొక విషయమే తెలియదు.”

ఇక యీ ప్రశ్నకు అమ్మ సమాధానం ఇచ్చేంతలోనే, ఆ విషయంమీద వాగ్యుద్ధం అంతటితో పూర్తయినట్లుగా, మరొక పేజీ చూడబోయే ముందు, లోపట అణచిపెట్టిన రిమార్కు ఒకటి పైకి రాకుండా ఉండలేకపోయింది.

“అసలు నీకు దేశభక్తే లేదు!”

ఈ దఫా అరగంటవరకూ నాన్న మాట్లాడకుండా పేపరు చదవడంలోనే నిమగ్నుడయ్యాడు. అయితే తప్పక బయటపెట్టవలసిన మరొక వార్త.

“ఐ. ఏ. యస్. ఆఫీసరుకుకూడా శిక్ష వేశారన్న మాట!”

అమ్మ పుస్తకం మూసేసింది. “అదిగో, నేను ఇదివరకే చెప్పలేదూ! మన భారతీయులకు ఆలాటి ఉన్నతోద్యోగాలు చేసే అర్హత ఉందా అని! పదవికున్న హోదా అన్నా నిర్వహించుకోవడం చేతగాని దద్దమ్మలు!”

“నీ ముఖం! ఇదేదో ప్రత్యేక సందర్భం!” అంటూ నాన్న ఏదో సమర్థించుకోవాలని చూచాడు గాని ఆయన గొంతులో వినవచ్చిన ఓటమిని అప్పుడే పసిగట్టేసింది అమ్మ!

“ఫర్వాలేదులే, అంతా ఒకలాటి వాళ్ళమే!”

అమ్మ ఓదార్చింది అయితే గెలుపు ఖాయం అని తెల్సిన తర్వాత, మిన్నకుండడం అమ్మ సంప్రదాయం కాదు.

“ప్రతివాడూ, లంచాలు తీసుకొని డబ్బుచేసుకునేవాడే! అయితే, ఏదో దురదృష్టంకొద్దీ ఈ చవట ఒక్కడే దొరికిపోయాడు.”

నాన్న తిరిగి అందుకున్నాడు.

“అదేం బాగాలేదు. అందరూ లంచం తీసుకుంటారని రూఢిగా ఎట్లా చెప్పగలవ్?”

“ఆ ఆ! ఇప్పటికే పదిగంటలయింది. పొరుగింటివాళ్ళు పడుకున్నారు కూడా!”

అమ్మ చర్చించదలుచుకోకపోతే, ఏ విషయాన్నైనా ఇలా అతి సులువుగా మార్చేయగలుగుతుందని, నాన్నకు కూడా తెలుసు. అదీగాక ప్రక్క ఇంటివాళ్ళు ఎన్నిగంటలకు పడుకుంటే మనకెందుకు?

“ఇంతకూ, నేను సగం పేపరుకూడా చదవలేదు” నాన్న ఫైనలు రిమార్కు చేశాడు.

“అదే! మీకసలు వార్తాపత్రిక ఎలా చదవాలో తెలిస్తేగా? ఇలా కరెంటు వృథాగా కాల్చేసేదేమో మీరు. తీరా కరెంటు బిల్లు రాగానే మామీద విరుచుకుపడతారు!”

ఈ అణ్వస్త్రప్రయోగంతో నాన్న పూర్తిగా ఓడిపోయాడు. పేపరు మూసేసి, విసవిస పడక గదిలోకి వెళ్ళాడు.

అయితే మనస్సులోనే పేపరు చదువుకోక అప్పుడప్పుడూ బిగ్గరగా చదివి, ఇలాంటి ఓటమి నాన్న ఎందుకు కోరి తెచ్చుకుంటాడో ఇంత వరకూ మాకు బోధపడలేదు. ★